batukammanews.com
TEL/2019/78873

# బతుకమ్మ

15 ఆగస్టు 2026
శనివారం
తాజా వార్తల సద్దిమూట

## మిస్టరీగా ప్రిన్సిపాల్ రూపారెడ్డి దారుణ హత్య




నల్గొండ, బతుకమ్మ :ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్ హత్య ఉదంతం నల్లగొండ జిల్లాలో సంచలనంగా మారింది. విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన ప్రిన్సిపల్ రూపారెడ్డిని దుండగులు విచక్షణారహితంగా పొడిచి దారుణంగా హత్య చేశారు. పక్కా ప్లాన్‌తో ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపల్‌ను హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హత్యకు గల కారణాలపై దర్యాప్తులో స్పష్టత రాకపోవడంతో.. నిందితుల జాడ ఇంకా తెలియరాలేదు.

## దేశంలో రిచ్ బిజినెస్ మెన్

### రూ.271 కోట్లకు పెంట్ హౌస్ కొన్న మానవ్ సర్ధానా




వెబ్ డెస్క్, బతుకమ్మ :భారతదేశంలో ఎందరో సంపన్నులు ఉన్నారు. వేల కోట్ల ఆస్తులు కలిగిన వాళ్లు, వందల కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని నడిపిస్తున్న వారు ఉన్నారు. అయితే ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ఓ వ్యక్తి పేరు బాగా వినిపిస్తోంది. నిన్నటి వరకు ఓ ఖరీదైన ఇంటి గురించి జరిగిన చర్చ ఇప్పుడు దాన్ని కొనుగోలు చేసిన వ్యక్తి ఎవరూ..? అతని ప్రొఫైల్ ఏంటని వెదుకుతు న్నారు. అతని పేరే మానవ్ సర్ధానా. ఈ ఫేమస్ బిజినెస్‌మెన్ ఎవరో తెలియాలంటే ఆయన రిచ్ టేస్ట్ గురించి ముందు తెలుసుకోవాలి.హర్యానా రాజ ధాని గుర్గావ్‌లో ఈమధ్య కాలంలో భారీ ధరకు అమ్ముడైన ఓ ఫ్లాట్ గురించి దేశం అంతా చర్చించుకుంది. ఏంటీ నిజంగా ఓ లగ్జరీ ప్రాజెక్టులోని పెంట్ హౌస్‌ని అక్షరాల రూ.271 కోట్ల రూపాయలకు అమ్ముడైందన్న వార్త ఇప్పటికి వైరల్ అవుతోంది. అయితే గుర్గావ్‌లోని ప్రెస్టేజియస్ వెంచర్ డీఎల్ఎఫ్ సంస్థ 2024 అక్టోబర్‌లో 'ది డాలియాస్' ప్రాజెక్టును ప్రారంభించింది. గురుగ్రామ్‌లోని డీఎల్ఎఫ్ ఫేజ్ 5లో నిర్మించిన ఈ హై వాల్యూ హౌసింగ్ కమ్యూనిటీలో ఒక్క పెంట్ హౌస్ కొనుగోలు చేసిన వ్యక్తే మానవ్ సర్ధానా. ఒక్క పెంట్ హౌస్‌ని 271 కోట్లు ఖర్చు చేశాడంటే అతను ఎవరై ఉంటారు.. అతని ఆర్ధిక మూలాలు, వ్యాపార సముదా యాలు, ఆస్తి, పాస్తులు ఏంటనే దానిపై వివరాలు రాబడితే కొన్ని జాతీయ మీడియాలు మానవ్ సర్ధానా గురించి మనకు తెలియని చాలా విషయాలు బయటకు వచ్చాయి. మానవ్ సర్ధానా ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త. అతను మాత్రమే కాదు శతాబ్ధాల బిజినెస్ హిస్టరీ కలిగిన సర్ధానా ఫ్యామిలీకి చెందిన వారసుడే మానవ్ సర్ధా నా. మానవ్ సర్ధానా తండ్రి ఎస్ బీ సర్ధానా 1969లో ఇంపీరి యల్ ఆటో ఇండస్ట్రీస్ సంస్థను నెలకోల్పి బాగా పాపులర్ అ య్యారు. ఆటోమొబైల్ రంగానికి అవసరమైన పరికరాలను తయా రు చేసే ఈ సంస్థ దేశంలోనే కీలక సంస్థగా మారిపోయింది. గ్లోబల్ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ వార్‌బర్గ్ పింకస్ దీన్ని కొనుగోలు చేయడానికి ముందే మానవ్ సర్ధానా ఇంపీరియల్ ఆటోలో భాగస్వామిగా ఉన్నారు.

# ముందస్తుగానే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు

### విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిపివేయకూడదు
### సీఎం రేవంత్ రెడ్డి




హైదరాబాద్, బతుకమ్మ :ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను ప్రతి ఏటా ముందస్తుగానే విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఫీజు రీయింబర్స్ మెంట్ కోసం విద్యార్థులు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేకుండా, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అర్హులైన విద్యార్థుల ఖాతాల్లోనే ముందుగానే నిధులు జమ చేసే విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లో హెచ్ఎండీఏ మైదానానికి ఎదురుగా ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతీరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలను ముఖ్యమంత్రి ఆవిష్కరించి వారికి నివాళు లర్పించారు. అనంతరం హెచ్ఎండీఏ మైదానంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థుల సర్టిఫికెట్లను యాజమాన్యాలు నిలిపివేయడానికి వీల్లేదని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థులు అడగకుండానే వారి ఖాతాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు జమ చేసేలా వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని చెప్పారు. ఈ విద్యా సంవత్సరం నుంచే ముందస్తుగా బ్యాంకు ఖాతాల్లో నిధులను సిద్ధంగా ఉంచనున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా సుమారు రూ.2,400 కోట్లను విద్యార్థుల ఖాతాల్లో జమ చేసి, ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని మరింత పారదర్శకంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని రేవంత్‌రెడ్డి సూచించారు. గతంలో ఇంజనీరింగ్ లేదా వైద్య విద్యలో డిగ్రీ ఉంటే ఉద్యోగాలు లభించేవని, ప్రస్తుతం పరిస్థితులు మారిపోయాయని అన్నారు. కేవలం సర్టిఫికెట్లు కాకుండా నైపుణ్యాలు ఉన్నవారికే మెరుగైన అవకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యతో పాటు ఆ తర్వాతి దశలో నైపుణ్య శిక్షణ అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఏటీసీలు, పాలిటెక్నిక్ విద్య, స్కిల్స్ యూనివర్సిటీతో పాటు ఇతర సాంకేతిక విద్యా అవకాశాలను విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా బాలికలు నర్సింగ్ విద్యను అభ్యసిస్తే జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాల్లో భారీగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సీఎం తెలిపారు. నైపుణ్యం కలిగిన యువతకు ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు ఎదురుచూస్తున్నాయని చెప్పారు. ప్రస్తుతం విద్యార్థుల్లో పోటీ తీవ్రంగా పెరిగిందని, చాలామంది 90 శాతానికి పైగా మార్కులు సాధిస్తున్నారని అన్నారు. చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యాలు, క్రీడలు, ఇతర ప్రతిభా రంగాల్లో రాణించే విద్యార్థులను కూడా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో ప్రతి విద్యార్థిలోనూ ప్రతిభ దాగి ఉందని, "మట్టిలో మాణిక్యాలు" ఉన్నాయని పేర్కొన్నారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా క్రీడల్లో ప్రతిభ కనబరిచే వారికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు కోటి రూపాయల వరకు నగదు బహుమతులు అందించే విధానాన్ని తీసుకురానున్నట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. బాక్సింగ్ చాంపియన్ నిఖత్ జరీన్, క్రికెటర్ మహ్మద్ సిరాజ్, అథ్లెట్ దీప్తి జీవాంజి వంటి క్రీడాకారులను ఉదాహరణగా ప్రస్తావిస్తూ, రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించి, ఒలింపిక్స్ లో పతకాలు సాధించేలా యువత కృషి చేయాలని అన్నారు. ప్రతిభ చూపిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు, నగదు ప్రోత్సాహకాలు అందించే బాధ్యత తనదేనని సీఎం పేర్కొన్నారు. చదువు, నైపుణ్యాలే జీవితాలను మార్చగలవని రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో కంప్యూటర్ సైన్స్ చదివితే అమెరికాలో ఉద్యోగం పొందే అవకాశాలు ఎక్కువగా ఉండేవని, ప్రస్తుతం సాంకేతిక విప్లవం కారణంగా పరిస్థితులు వేగంగా మారుతున్నాయని చెప్పారు.





## జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించిన సీఎం

హైదరాబాద్, బతుకమ్మ :సామాజిక సంస్కర్తలు, విద్యా ప్రదాతలు మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే దంపతుల విగ్రహాలను తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్ ఎదురుగా ఏర్పాటు చేసిన విగ్రహాలను సీఎం ఆవిష్కరించి, మహనీయులకు పుష్పాంజలి ఘటించారు. సమాజంలో సమానత్వం, విద్య, మహిళా సాధికారత కోసం పూలే దంపతులు చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి, ముఖ్యంగా మహిళల విద్యాభివృద్ధికి సావిత్రీబాయి పూలే చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, బీసీ సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అప్పుడు రూ.500 లంచంకే బాధపడ్డారు

### ఇప్పుడు రూ.కోటి కొట్టేశారు

### వైరలవుతున్న ఐపీఎస్ రాహుల్ వీడియా



# మిస్టరీగా ప్రిన్సిపాల్ రూపారెడ్డి దారుణ హత్య

నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలోని ప్రైవేట్ స్కూల్ నిర్వహిస్తున్న మహిళ రూపారెడ్డి దారుణ హత్యకు గురైంది. ఆమె ఇంట్లో ఒంటరిగా ఉండగా దుండగులు హత్య చేశారు. కొండమల్లేపల్లిలోని జెబీ కాలనీలో ఆగస్ట్ 12 ఉదయం రూపారెడ్డి హత్యకు గురైన విషయం బయటపడింది.

ఓ సీఐ, ఇద్దరు ఎస్ఐలు నివాసం ఉండే కాలనీలో ఓ మహిళ దారుణ హత్యకు గురి కావడం చర్చనీయాంశంగా మారింది. రూపారెడ్డి కొన్ని సంవత్సరాలుగా కొండమల్లేపల్లిలోని నాగార్జున గ్రామర్ స్కూల్ నిర్వహిస్తూ ప్రిన్సిపల్ గా వ్యవహరిస్తున్నారు. ఆమె భర్త రాజేందర్రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. వీరు జేపీ కాలనీలోని సొంత ఇంట్లో నివాసం ఉంటున్నారు. వీరికి హైదరాబాద్ శివారులోని గుర్రంగూడాలో కూడా సొంత ఇల్లు ఉంది. కుమారుడు అభినవ్ రెడ్డి హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. సెలవులు వచ్చినప్పుడు హైదరాబాద్‌కు వెళ్లి కుమారుడితోపాటే రూపారెడ్డి దంపతులు హైదరాబాద్‌లో ఉంటారు. ఈ క్రమంలోనే శని, ఆది, సోమవారం వరసగా మూడు రోజులు సెలవులు రావడంతో... రూపారెడ్డి భర్తతో కలిసి హైదరాబాద్ లోని తన కుమారుడి వద్దకు వెళ్లారు. తిరిగి మంగళవారం ఉదయం కొండమల్లేపల్లి కి రూపారెడ్డి ఒక్కరే రాగా ఆమె భర్త రాజేందర్రెడ్డి పని ఉందని హైదరాబాద్‌లోనే ఉండిపోయాడు.

ఎప్పటి లాగే మంగళవారం ఉదయం స్కూల్ కి వెళ్లిన రూపారెడ్డి సాయంత్రానికి తిరిగి కొండేమల్లేపల్లిలోని జెబీ కాలనీలో ఉన్న తన ఇంటికి వచ్చింది. బుధవారం ఉదయం రూపారెడ్డికి ఆమె భర్త రాజేందర్ రెడ్డి ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఆమె లిఫ్ట్ చేయకపోవడంతో... తమ ఇంటి పై అద్దెకు ఉంటున్న వారికి ఫోన్ చేసి ఒక్కసారి ఇంట్లో చూడమని రాజేందర్ రెడ్డి కోరాడు. అద్దెకు ఉంటున్న వారు వెళ్లి ఇంటి తలుపులు ఎన్నిసార్లు తట్టినా రూపారెడ్డి తలుపు తీయకపోవడంతో.. ఇంటి పక్కన ఉన్న వారిని కూడా పిలిచి తలుపులు తెరిపించే ప్రయత్నం చేశారు. కానీ రూపారెడ్డి డోర్ తెరవలేదు. వెనక ఉన్న కిచెన్ వద్దకు వెళ్లి చూడగా తలుపులు తెరిచి ఉండటం.. లోపలికి వెళ్లి చూడగా రూపారెడ్డి రక్తపు మడుగులో విగత జీవిగా కనిపించడంతో వెంటనే రూపారెడ్డి భర్తకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు స్థానికులు.సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీమ్‌తో పాటు డాగ్ స్క్వాడ్‌తో హత్య జరిగిన ప్రవేశంలో ఆధారాలు పరిశీలించారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. రూపారెడ్డి ఒంటిపైన 27 వరకు కత్తిపోట్లు ఉన్నట్లు పోస్టుమార్టం రిపోర్ట్‌లో తేలింది. రూపారెడ్డిని కచ్చితంగా హత్య చేయాలనే పక్కా ప్లాన్‌తో రెక్కీ చేసి మరీ హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా ఓ అంచనాకు వచ్చారు. రూపారెడ్డి స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన కొద్దిసేపటి తర్వాత అంటే సాయంత్రం 7గంటల లోపే రూపారెడ్డి దారుణ హత్యకు గురై ఉండవచ్చని పోలీసులు అంచనా వేస్తున్నారు. నిందితుడు ఇంటి వెనకాల నుంచి ఇంట్లోకి ప్రవేశించి.. కిచెన్ రూమ్ గుండా ఇంట్లోకి ప్రవేశించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఇంటి ముందు సీసీ కెమెరాలు ఉండటంతో నిందితుడు ఇంటి వెనక బాగం నుంచి లోపలికి ప్రవేశించినట్లు పోలీసులు భావిస్తున్నారు. రూపారెడ్డి ఇంటికి చేరుకోవడానికి కూడా నిందితుడు అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

సీసీ కెమెరాలలో తన దృశ్యాలు రికార్డు కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుని.. ఆమె ఇంటి వద్దకు చేరుకొని.. రూపారెడ్డిని దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు అభిప్రాయానికి వచ్చారు. హత్య జరిగిన తరువాతే రూపారెడ్డి సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యిందని... రూపారెడ్డిని దారుణంగా హత్య చేసిన తరువాత ఆమె సెల్ ఫోన్‌ను హంతకుడు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు భావిస్తున్నారు. హంతకుడు హత్యకు ఉపయోగించిన కత్తి కూడా షార్ప్ వెపన్‌గా అనుమానిస్తున్నారు. కత్తిని కూడా నేరస్తుడు తన వెంట తీసుకుని వెళ్లి ఉండవచ్చని పోలీసులు ,భావిస్తున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు రూపా రెడ్డిని ఇంత దారుణంగా హత్య చేయాల్సిన అవసరం ఎవరికి ఉంది? ఎందుకు ఉంది..? హత్యకు గల కారణాలు ఏంటి? అనే కొణంలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. దగ్గరి బంధువులను, స్నేహితులను, రూపారెడ్డి నిర్వహిస్తున్న స్కూల్ స్టాఫ్‌ను, స్థానికులను పోలీసులు విచారిస్తున్నారు.

ఆర్థిక లావాదేవీలపైనా, వ్యాపార వివాదాలపైనా పోలీసులు దృష్టి సారించారు. హత్య జరిగిన ప్రాంత సెల్‌ఫోన్ టవర్ డంప్‌ను కూడా పోలీసులు క్షుణ్ణంగా విశ్లేషిస్తున్నారు. కొండమల్లేపల్లిలోని అన్ని రూట్‌లలో ఉన్న సీసీ ఫుటేజ్‌లను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. కొందరు అనుమానాస్పద వ్యక్తుల కదలికలను, వాహనాల మూమెంట్స్‌ను గుర్తించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. మొత్తంగా రూపారెడ్డి హత్య పక్కాగా ప్లాన్ చేసి రెక్కీ నిర్వహించి దారుణంగా హత్య చేశారని పోలీసులు భావిస్తున్నారు.

హత్యకు పక్కా కారణం ఉంటుందని భావిస్తున్న పోలీసులు.. ఆ కారణం ఎంటో తేలితే నిందితులను గుర్తించడం పెద్ద సమస్య కాదని చెబుతున్నారు. మొత్తంగా రూపారెడ్డి హత్య కేసు సంచలనంగా మారగా.. నిందితులు ఎవరు? అనుమానితుల జాడపై స్పష్టత రాకపోవడంతో పోలీసులకు ఈ కేసు సవాల్‌గా మారింది.

# ముందస్తుగానే ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు

కృత్రిమ మేధస్సు (ఏఐ) కారణంగా ఇంజనీరింగ్, గ్రాడ్యుయేషన్, ఐటీ రంగాల్లోని కొన్ని ఉద్యోగాలు కూడా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ మార్పులను ఎదుర్కొనేందుకు యువతను భవిష్యత్ నైపుణ్యాలతో సిద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కులాల మధ్య అంతరాలను తగ్గించి, అన్ని వర్గాల పిల్లలు ఒకే చోట కలిసి చదువుతూ, జీవించేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ విధానాన్నీ అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. విద్య ద్వారా సామాజిక సమానత్వాన్ని సాధించడమే ఈ విధానం లక్ష్యమన్నారు. జ్యోతీరావు పూలే, సావిత్రీబాయి పూలే వంటి మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం కేవలం జయంతి, వర్ధంతులను నిర్వహించేందుకే కాదని రేవంత్‌రెడ్డి అన్నారు. వారి త్యాగాలు, పోరాటాలు, సామాజిక సంస్కరణల నుంచి భవిష్యత్ తరాలు స్ఫూర్తి పొందేలా ఈ విగ్రహాలు నిలవాలని ఆకాంక్షించారు. మహనీయుల స్ఫూర్తితో విద్యలో రాణించడంతో పాటు సామాజిక చైతన్యాన్ని పెంపొందించుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీఎం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, మహ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారులు కే. కేశవరావు, వి. హనుమంతరావు, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌తో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# దేశంలో రిచ్ బిజినెస్ మెన్

ప్రస్తుతం ఈ గ్రూపునకు చెందిన అనేక కంపెనీలకు మానవ్ సర్దానా డైరెక్టర్‌గా, వెరీ రిచ్ అండ్ బిజీ బిజినెస్‌మెన్‌గా ఉన్నాడజనుకు పైగా కంపెనీలలో డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు.

ఇక మానవ్ సర్దానా కొనుగోలు చేసిన వెరీ కాస్ట్లీ పెంట్ హౌస్ విషయానికి వస్తే .. ఒక సింగిల్ లివింగ్ హౌస్ కోసం రూ.271 కోట్లు ఖర్చు చేశారంటే దాని ప్రత్యేకత గురించి తప్పకుండా చెప్పుకోవాల్సిందే. గోల్ఫ్ కోర్స్ రోడ్‌లోని సెక్టార్ 54లో ఉన్న ఈ పెంట్‌హౌస్ సూపర్ ఏరియాగా నిర్మించారు. డీఎల్ఎఫ్ ది డాలియాలో 17,200 చదరపు అడుగులు కాగా, కార్పెట్ ఏరియా దాదాపు 10,500 చదరపు అడుగులుగా ఉంది. ఈ డీల్ విలువ ప్రకారం.. సూపర్ ఏరియా లెక్కన చదరపు అడుగుకు రూ. 1.58 లక్షలు, కార్పెట్ ఏరియా ప్రకారం చదరపు అడుగుకు రూ. 2.6 లక్షల రికార్డు ధర ఉంటుందని మార్కెట్ వర్గాలు తెలిపాయి. 17 ఎకరాల విస్తీర్ణంలో దీనిని నిర్మిస్తున్న ఈ లగ్జరీ లివింగ్ స్పేస్‌లో సుమారు 420 అపార్ట్‌మెంట్లు, పెంట్‌హౌస్‌లు ఉన్నాయి. ఒక్కో అపార్ట్‌మెంట్ ధర రూ. 100 కోట్ల నుంచి రూ. 170 కోట్లు పలుకుతోందని జాతీయ మీడియా తమ కథనంలో పేర్కొంది. ఇక పెంట్‌హౌస్‌ల రేట్లు అంతకు మించిన డిమాండ్ ఉన్నట్లుగా మానవ్ సర్దానా కొనుగోలు చేసిన దాన్ని బట్టి చూస్తే అర్థమవుతోంది. మొత్తం ఈ ప్రాజెక్టు ద్వారా రూ. 40,000 కోట్లకు పైగా ఆదాయం వస్తుందని డీఎల్ఎఫ్ అంచనా వేస్తోంది. పీటీఐ కథనం ప్రకారం, ఇప్పటికే 65% యూనిట్లు అమ్ముడయ్యాయి. కరోనా మహమ్మారి తర్వాత దేశంలోని ప్రధాన నగరాలైన గురుగ్రామ్, ముంబైలలో విలాసవంతమైన గృహాలకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. సంపన్న కొనుగోలుదారులు పెద్ద, ప్రత్యేకమైన ఇళ్లను కోరుకుంటున్నారని ఈ భారీ డీల్ స్పష్టం చేస్తోంది

# అప్పుడు రూ.500 లంచంకే బాధపడ్డారు

వెబ్ డెస్క్, బతుకమ్మ :సివిల్ సర్వీసెస్ అభ్యర్థిగా ఉన్నప్పుడు ఒక పంచాయతీ అధికారి రూ.500 లంచం అడిగితే తీవ్రంగా బాధపడిన ఓ వ్యక్తి.. ఐపీఎస్ అధికారిగా మారిన తర్వాత ఏకంగా రూ.కోటి లంచం తీసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటుండటం సంచలనంగా మారింది. ఛత్తీస్‌గఢ్ క్యాడర్‌కు చెందిన ట్రైనీ ఐపీఎస్ అధికారి రాహుల్ బన్సాల్ వివాదాస్పద రీతిలో వార్తల్లోకెక్కారు. ఐపీఎస్‌గా ఎంపికైన అనంతరం రాహుల్ బన్సాల్ ఛత్తీస్‌గఢ్‌లోని సుర్గుజా జిల్లాలో సీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఆ సమయంలో ఓ సైబర్ నేరానికి సంబంధించిన వ్యవహారాన్ని క్లోజ్ చేసేందుకు ఆయన రూ.కోటి లంచం డిమాండ్ చేసి, రెండు దఫాలుగా ఆ మొత్తాన్ని తీసుకున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వాట్సప్ చాట్లు, డిజిటల్ లావాదేవీల ఆధారాలను బాధితులు దిల్లీలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానానికి సమర్పించారు. వీటిని పరిశీలించిన కోర్టు.. ఈ ఆరోపణలపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి నివేదిక ఇవ్వాలని ఛత్తీస్‌గఢ్ పోలీసులను ఆదేశించింది. ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో సివిల్స్ సాధించకముందు రాహుల్ బన్సాల్ ఇచ్చిన మాక్ ఇంటర్వ్యూ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. “మా సోదరుడు అమెరికా వెళ్లేందుకు బర్త్ సర్టిఫికేట్ త్వరగా కావాల్సి వస్తే పంచాయతీ అధికారి రూ.500 లంచం అడిగారు. ఆ డబ్బు ఇవ్వాల్సి రావడం నాకు చాలా బాధ కలిగించింది” అని రాహుల్ ఆ ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, సమాజంలో అవినీతి, అధికారుల అసమర్థతపై గొప్పగా మాట్లాడారు. ఒకప్పుడు రూ.500 లంచం ఇస్తేనే బాధపడిన వ్యక్తి, ఉద్యోగం వచ్చాక రూ.కోటి నొక్కేశారన్న వార్తలతో నెటిజన్లు ఆయనపై తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. అయితే, ఈ వ్యవహారంపై ఛత్తీస్‌గఢ్ పోలీసుల నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# ఎలక్ట్రోలైట్ డ్రింక్స్ నిజంగానే శరీరానికి మేలు చేస్తాయా.. ప్రచారంలో నిజమెంత..?

ఎలక్ట్రోలైట్ డ్రింక్స్ ప్రస్తుతం స్పోర్ట్స్ ఆడే వారు మాత్రమే కాకుండా సాధారణ ప్రజల్లోనూ బాగా ప్రాచుర్యం పొందుతున్నాయి. శరీరానికి ఎక్కువ హైడ్రేషన్ అందిస్తాయని భావించి చాలామంది వీటిని రోజువారీ పానీయాలుగా తీసుకుంటున్నారు. అయితే ప్రతి రోజూ ఎలక్ట్రోలైట్ డ్రింక్ తాగాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. శరీరం నుంచి నీటితోపాటు ఎలక్ట్రోలైట్లు ఎక్కువగా కోల్పోయే కొన్ని పరిస్థితుల్లో మాత్రమే ఇవి ప్రయోజనకరంగా ఉంటాయి. సోడియం, పొటాషియం, కాల్షియం, మెగ్నిషియం, క్లోరైడ్ వంటి ఎలక్ట్రోలైట్లు శరీరంలో అనేక ముఖ్యమైన విధులను నిర్వహిస్తాయి. ఇవి శరీరంలోని ద్రవ సమతుల్యతను నియంత్రించడంతోపాటు నరాల సంకేతాలు, కండరాల పనితీరు, గుండె పనితీరుకు అవసరమవుతాయి. నీటితోపాటు ఈ ఖనిజాలు సరైన నిష్పత్తిలో ఉండటం శరీరం సాధారణంగా పనిచేయడానికి ముఖ్యమైంది. అధికంగా చెమట పట్టడం, వాంతులు, విరేచనాలు, ఎక్కువసేపు వ్యాయామం చేయడం లేదా తీవ్రమైన డీహైడ్రేషన్ వంటి పరిస్థితుల్లో శరీరం నీటితోపాటు ఎలక్ట్రోలైట్లను కూడా కోల్పోతుంది. ఈ సమయంలో వాటిని తిరిగి భర్తీ చేయడానికి ఎలక్ట్రోలైట్ డ్రింక్స్ ఉపయోగపడతాయి. ఎలక్ట్రోలైట్ల అసమతుల్యత ఏర్పడితే కండరాల తిమ్మిరి, బలహీనత, అలసట, తలనొప్పి, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. తీవ్రమైన సందర్భాల్లో గుండె స్పందనలో మార్పులు, గందరగోళం కూడా ఏర్పడతాయి.

**ఎలక్ట్రోలైట్ డ్రింక్స్ అవసరమా..**

ఎలక్ట్రోలైట్ డ్రింక్స్‌లో ఈ ఖనిజాలను ద్రవ రూపంలో అందిస్తారు కాబట్టి శరీరానికి సులభంగా అందుబాటులోకి వస్తాయి. సరైన సమయంలో, అవసరమైన మోతాదులో తీసుకుంటే శరీరంలోని ద్రవ సమతుల్యతను కాపాడటానికి, కండరాల పనితీరుకు, నరాల సంకేతాల ప్రసరణకు, గుండె పనితీరుకు ఇవి సహాయపడతాయి. అయితే ఎలక్ట్రోలైట్ డ్రింక్స్‌కు పెరుగుతున్న ఆదరణకు ప్రధాన కారణాల్లో ఆన్‌లైన్ మార్కెటింగ్ కూడా ఒకటిగా మారింది. సాధారణ శీతల పానీయాలు, ఎనర్జీ డ్రింక్స్‌కు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలుగా వీటిని చాలామంది భావిస్తున్నారు. కానీ ప్రతి ఎలక్ట్రోలైట్ డ్రింక్ ఒకే విధమైన పదార్థాలతో తయారవదు. కాబట్టి కొనుగోలు చేసే ముందు లేబుల్‌పై ఉన్న సోడియం, పొటాషియం, చక్కెర, కృత్రిమ స్వీటెనర్లు, ప్రతి సర్వింగ్‌లోని క్యాలరీలను పరిశీలించడం అవసరం. ఆరోగ్యంగా ఉన్న సాధారణ పెద్దలకు ప్రతిరోజూ ఎలక్ట్రోలైట్ డ్రింక్స్ అవసరం ఉండవు. పండ్లు, కూరగాయలు, పాలు, పెరుగు, సాధారణ సమతుల్య ఆహారం ద్వారా కూడా శరీరానికి అవసరమైన అనేక ఎలక్ట్రోలైట్లు లభిస్తాయి. సాధారణ రోజువారీ పనులు లేదా తక్కువ సమయంపాటు చేసే వ్యాయామాలకు సాధారణంగా నీరు సరిపోతుంది.

**ఎవరు తీసుకోవాలి..**

అయితే ఎక్కువసేపు, తీవ్రంగా వ్యాయామం చేసే సమయంలో ఎలక్ట్రోలైట్ డ్రింక్స్ ఉపయోగపడతాయి. మారథాన్ శిక్షణ, ఎండ్యూరెన్స్ స్పోర్ట్స్ లేదా ఎక్కువసేపు శారీరక శ్రమ చేసే వారికి చెమట ద్వారా సోడియం, ఇతర ద్రవాలు ఎక్కువగా కోల్పోయే అవకాశం ఉంటుంది. అలాంటి సందర్భాల్లో సోడియం కలిగిన ద్రవాలు శరీరంలోని ద్రవ సమతుల్యతను కాపాడటానికి సహాయపడతాయి. ఎండలు తీవ్రంగా ఉన్న సమయంలో కూడా ఎలక్ట్రోలైట్ల అవసరం పెరుగుతుంది. ముఖ్యంగా ఎండలో బయట పనిచేసేవారు, ఎక్కువగా చెమట పట్టేవారు, వేడి వాతావరణంలో ఎక్కువసేపు ఉండేవారు డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉన్నందున తగినంత ద్రవాలు తీసుకోవడంపై శ్రద్ధ పెట్టాలి. అనారోగ్య సమయంలో కూడా ఎలక్ట్రోలైట్ డ్రింక్స్ కొన్ని సందర్భాల్లో ఉపయోగపడతాయి. వాంతులు, విరేచనాలు, జ్వరం లేదా డీహైడ్రేషన్ కారణంగా శరీరం నుంచి నీరు, ఎలక్ట్రోలైట్లు ఎక్కువగా కోల్పోతే వాటిని తిరిగి భర్తీ చేయాల్సి వస్తుంది. కొన్ని వైద్య పరిస్థితుల కారణంగా నీరు, ఎలక్ట్రోలైట్లు ఎక్కువగా కోల్పోయే వారికి కూడా వైద్యుల సూచన మేరకు ఎలక్ట్రోలైట్ ద్రావణాలు ఉపయోగపడతాయి.

**అవసరం లేకున్నా తీసుకుంటే..**

అయితే అవసరం లేకుండా ఎక్కువ మొత్తంలో ఎలక్ట్రోలైట్ డ్రింక్స్ తీసుకోవడం కూడా మంచిది కాదు. వీటిలో ఉండే అదనపు చక్కెరను అధికంగా తీసుకుంటే అనవసరమైన బరువు పెరగడానికి దారితీస్తుంది. అలాగే కొన్ని డ్రింక్స్‌లో సోడియం అధికంగా ఉండే అవకాశం ఉంటుంది. రక్తపోటు ఉన్నవారు లేదా శరీరంలో నీరు నిల్వ ఉండే సమస్య ఉన్నవారు వీటిని తీసుకునే విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. ఒకేసారి ఎక్కువ మొత్తంలో ఎలక్ట్రోలైట్ డ్రింక్స్ తీసుకోవడం వల్ల ఎలక్ట్రోలైట్ అసమతుల్యత, జీర్ణ సంబంధిత సమస్యలు, కొందరు వ్యక్తుల్లో కిడ్నీలకు సంబంధించిన సమస్యలు ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఇప్పటికే కిడ్నీ వ్యాధి, హైపర్‌టెన్షన్ లేదా శరీరంలో నీరు నిల్వ ఉండే సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా లేకుండా వీటిని తరచూ తీసుకోకపోవడం మంచిది. ఎక్కువగా చెమట పట్టడం, కండరాల్లో తిమ్మిరి, బలహీనత, తల తిరగడం, ఎక్కువసేపు శారీరక శ్రమ చేసిన తర్వాత తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే శరీరంలో ద్రవాలు, ఎలక్ట్రోలైట్ల లోపం ఉండే అవకాశం ఉంది. ముందుగా తగినంత నీరు, హైడ్రేటింగ్ ఆహారాలు తీసుకోవడంపై దృష్టి పెట్టాలి.

**ప్రత్యామ్నాయాలు ఇవే..**

ఎలక్ట్రోలైట్ డ్రింక్స్‌కు బదులుగా కొబ్బరి నీరు, అరటిపండ్లు, నారింజ, పుచ్చకాయ, పెరుగు, పాలు, ఆకుకూరలు వంటి ఆహారాల ద్వారా కూడా శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లను పొందవచ్చు. అయితే వ్యక్తి అవసరాన్ని బట్టి ఎలక్ట్రోలైట్ల సరైన పరిమాణం మారుతుంది. కాబట్టి ఎలక్ట్రోలైట్ డ్రింక్‌ను సాధారణ సాఫ్ట్ డ్రింక్‌లకు మరో ప్రత్యామ్నాయంగా భావించి రోజూ తాగడం కంటే, శరీరం నుంచి నీరు, ఎలక్ట్రోలైట్లు ఎక్కువగా కోల్పోయే సందర్భాల్లో మాత్రమే ఉపయోగించడం మంచిది. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాయామం, అధిక చెమట, వాంతులు, విరేచనాలు లేదా తీవ్రమైన డీహైడ్రేషన్ ఉన్నప్పుడు ఇవి ఉపయోగపడతాయి. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు మాత్రం తమ పరిస్థితికి అనుగుణంగా వైద్యుల సలహా తీసుకోవడం అవసరం.

# మేరు కులస్థులకు కుట్టు మిషన్ల పంపిణీలో ప్రాధాన్యతపై హర్షం

## బీసీ సంఘం నగర ప్రధాన కార్యదర్శి కొట్టూర్ చంద్రకాంత్

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నియోజక వర్గానికి వెయ్యి కుట్టు మిషన్ల పంపిణీలో మేరు కులస్తులకు సింహాభాగం పంపిణీ చేస్తామని హామీ ఇవ్వడంపై బీసీ సంఘం నగర ప్రధాన కార్యదర్శి, జిల్లా మేరు సంఘం ఉపాధ్యక్షులు కొట్టూర్ చంద్రకాంత్ హర్షం వ్యక్తం చేశారు. శు క్రవారం నగరంలో బీసీ సంఘంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొట్టూర్ చంద్రకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వం నియోజకవర్గంలోని బీసీ మహిళలకు వెయ్యి కుట్టు మిషన్ల పంపిణీలో మేరు కులస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా మేరు సంఘం అనేక పర్యాయాలు పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్ ను, బీసీ?కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ ని కలిసినట్లు తెలిపారు. అప్పటికే జారీ అయిన జీవోను మీ న్యాయమైన కోరిక మేరు కులస్థుల జీవనదారమైన కుట్టు మిషన్ లు మీకు దక్కాలని ఏదో రకంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన దరిమిల మంత్రి పొన్నం ప్రభాకర్ మేరు కులస్థులకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని గైడ్ లైన్స్ ఇవ్వడం పై హర్షం వ్యక్తం చేశారు. గైడ్ లైన్స్ ఇవ్వడంలో కీలకంగా వ్యవహరించిన పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. మేరు కులస్థులు నేటి నుండి వచ్చేనెల సెప్టెంబర్ 15 వరకు తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు, కుల, ఆధాయ పత్రాలతో పాటు టైలర్ ట్రైనింగ్ సర్టిఫికెట్, ఫోటోతో టీజీవోబీఎంఎంఎస్?పోర్టల్ లో అప్లయ్ చేసి అట్టి కాపీని ప్రింట్ తీసుకుని అప్లికేషన్ ప్రింట్ కాపీ తో పాటు పై సర్టిఫికెట్ ల జిరాక్స్ కాపీలను జత



చేసి బీసీ వెల్ఫేర్ ఆఫీస్ లో అందించాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నగర అధ్యక్షులు దర్శనం దేవేందర్, మేరు సంఘ నాయకులు మంతెన దశరథ్, ఎన్ను పండరి, విప్లవ కుమారి, అరుణ్ చంద్, దీకొండ లక్ష్మణ్,మాకుల్లా శ్రీనివాస్, కాప్లయ్ రవి లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలు పరిష్కరించాలి

## టీజీవీపీ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు గంధం సంజయ్

కామారెడ్డి, బతుకమ్మ :కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు గంధం సంజయ్ అన్నారు. ఈ మేరకు టీజీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా నోడల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటు న్నారని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు సౌకర్యవంతంగా కూర్చొని చదువుకునేందుకు సరిపడా బెంచీలు లేవని, కళాశాల గ్రౌండ్ ఉన్నప్పటికీ వర్షాలు కురిసిన సమయంలో నీరు నిలిచిపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. అలాగే కొన్ని కళాశాలల్లో మౌలిక వసతులు సరిగ్గా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నోడల్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సంజయ్ తెలిపారు. కళాశాలల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరినట్లు చెప్పారు. సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే జిల్లా కేంద్రంలో ధర్నాలు చేపట్టి ఆందోళనలు ఉధృతం చేస్తామని టీజీవీపీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎండి సమీర్ ఖాన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.




# డీఈఓ కార్యాలయంలో తక్షణమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

## పీఆర్టీయూ తెలంగాణ జిల్లా గౌరవ అధ్యక్షులు కృపాల్ సింగ్ సోడి

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : పాలనలో పారదర్శకతను పెంపొందించేందుకు నిజామాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) కార్యాలయంలో తక్షణమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా గౌరవ అధ్యక్షులు కృపాల్ సింగ్ సోడి డిమాండ్ చేశారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వివిధ సందర్భాల్లో జిల్లా విద్యాశాఖ కార్యాలయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాధాన్యతను వివరించారని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లా విద్యాశాఖ కార్యాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ, నిజామాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మాత్రం ఇప్పటికీ ఏర్పాటు చేయకపోవడం విచారకరమన్నారు. ఇటీవల డీఈఓ తన చాంబర్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నారని, అదే సమయంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కూడా కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు కృపాల్ సింగ్ సోడి పేర్కొన్నారు. అయితే కొంతమంది సిబ్బంది డీఈఓకు విజ్ఞప్తి చేయడంతో కార్యాలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు నిలిచిపోయిందని ఆరోపించారు. కార్యాలయానికి వచ్చే ఉపాధ్యాయులు, ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు, ఉద్యోగులు తదితరులు ఎన్‌ఓసీలు, మెడికల్ బిల్లులు, డిప్యూటేషన్లు, ఇంక్రిమెంట్లు, ఎస్ఎస్సీ పరీక్ష విధులు, కారుణ్య నియామకాలు, ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు వంటి వివిధ పనుల కోసం



అధికారులను సంప్రదిస్తుంటారని ఆయన తెలిపారు. కార్యాలయంలో జరిగే కార్యకలాపాలు సీసీ కెమెరాల్లో రికార్డు కావడం వల్ల పాలనలో జవాబుదారీతనం, పారదర్శకత మరింత పెరుగుతాయని అన్నారు. సిబ్బంది సమయపాలన, కార్యాలయ విధుల నిర్వహణపై కూడా పర్యవేక్షణకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ఎలాంటి అనుమానాలకు తావులేకుండా కార్యాలయ కార్యకలాపాలు పారదర్శకంగా సాగేందుకు వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కృపాల్ సింగ్ సోడి డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన పీఆర్టీయూ తెలంగాణ జిల్లా పక్షాన కోరారు.

# మండల కమిటీల నిర్మాణం పూర్తి చేయాలి

## జిల్లా ఇన్ చార్జి మసాయి పేట యాదగిరి మాదిగ

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :సెప్టెంబర్ 9 లోగా జిల్లాలోని అన్ని మండలాల కమిటీల నిర్మాణ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా ఇన్ చార్జి మసాయిపేట యాదగిరి మాదిగ అన్నారు. నగరంలో సరికేల పోశెట్టి మాదిగ అధ్యక్షతన శుక్రవారం ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జిలు, మండల ఇన్‌చార్జిల నియామకం, వారి పని విధానం తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో కమిటీల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని నాయకులు సూచించారు. మండల స్థాయిలో సంస్థను మరింత బలోపేతం చేసేందుకు ఇన్‌చార్జిలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జిలు గంధమల్ల నాగభూషణం మాదిగ, మంద ప్రభాకర్ మాదిగ, తెడు గంగారాం మాదిగ, నాగం రాజేష్ మాదిగ, లసింగారి భూమయ్య, సోంపురి పోచయ్య మాదిగ, రోడ ప్రవీణ్ మాదిగతో పాటు మహిళా సమాఖ్య నాయకులు యమున మాదిగ, గుంటా పద్మ మాదిగ, ఏసిరెడ్డి సత్యక తదితరులు పాల్గొన్నారు.



# విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

## ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతరావు



బిచ్కుంద, బతుకమ్మ :ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం సిబ్బంది బాధ్యతని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతరావు అన్నారు. జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుంద మండల కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిని జుక్కల్ ఎమ్మెల్యే శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వైద్య సేవలు, సిబ్బంది హాజరు, విధుల నిర్వహణ తదితర అంశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సమయానికి విధులకు హాజరుకాని సిబ్బంది వివరాలను ఎమ్మెల్యే తెలుసుకున్నారు. హాజరు పట్టికను స్వయంగా పరిశీలించి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. బిచ్కుంద ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అంశంపై కామారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆసుపత్రిలో వైద్య సేవలు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇకపై ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది సమయపాలనతో పాటు ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై మరింత కఠినంగా పర్యవేక్షణ కొనసాగిస్తామని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు తెలిపారు.

# రికార్డుల నిర్వహణలో అవకతవకలకు తావివ్వకూడదు

## ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సురేష్



ఇందల్వాయి, బతుకమ్మ :రికార్డుల నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు తావివ్వకూడదని, అక్రమాలు లేదా నిర్లక్ష్యం గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సురేష్ అధికారులను హెచ్చరించారు. ఇందల్వాయి తహసీల్దార్ కార్యాలయాన్ని ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రెవెన్యూ రికార్డులను పరిశీలించడంతో పాటు భూభారతి, పట్టా మార్పిడి సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇందల్వాయి తహసీల్దార్ బాలయ్యను భూభారతి అమలు, పట్టా మార్పిడి తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఒకే పని కోసం రైతులు పదేపదే కార్యాలయం చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదన్నారు. పట్టా మార్పిడి, భూ రికార్డులను సమగ్రంగా పరిశీలించి అర్హులైన రైతులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, కులం, ఆదాయం, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో నిర్దేశించిన గడువులోగా ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ బాలయ్య, డిప్యూటీ తహసీల్దార్ శైలజ, జీపీఓ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఇద్దరు కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించింది. పదోన్నతి పొందిన సిబ్బంది నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కొంతకాలంగా పదోన్నతి కోసం ఎదురుచూస్తున్న కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా ప్రమోషన్ రావడంతో పోలీస్ సిబ్బం దిలో ఆనందం వ్యక్తమైంది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పదోన్నతి పొందిన సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, నిజామాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ నంబర్ 346 కె.ఎస్. శ్రీనివాస్, కానిస్టేబుల్ నంబర్ 1756 జి. అబ్బులకు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి లభించింది.

## అనుమతులకు విరుద్ధంగా ఇసుక తరలింపు

### డోజర్‌ని అదుపులోకి తీసుకున్న అధికారులు



సాలూరు, బతుకమ్మ :మండలంలోని తగ్గేల్లి మంజీరా పరివాహక ప్రాంతంలో అనుమతులకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న డోజర్‌ను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇంటి నిర్మాణాల కోసం ఇసుకను తరలించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా డోజర్‌తో ఇసుకను నింపుతున్నట్లు అధికారులకు సమాచారం అందింది. సమాచారం అందుకున్న ఆర్ఐలు శంకర్, ఆనంద్ వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. అనుమతులకు విరుద్ధంగా ఇసుకను నింపుతున్న డోజర్‌ను స్వాధీనం చేసుకుని, తదుపరి చర్యల నిమిత్తం సాలూరు తహసీలార్ కార్యాలయానికి తరలించారు. ఈ ఘటనపై అధికారులు విచారిణ చేపట్టి నిబంధనల మేరకు చర్యలు తీసుకోనున్నారు.

## ఆగస్టు 31 వరకు ఇంటర్ అడ్మిషన్లు

### జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపుడి రవికుమార్



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి ఆదేశాల మేరకు జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలను ఈ నెల 31వ తేదీ వరకు చేపట్టనున్నట్లు జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపుడి రవికుమార్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలలతో పాటు అన్ని గురుకుల జూనియర్ కళాశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 31వ తేదీ వరకు ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు కళాశాలల్లో చేరని పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, ఇంకా అడ్మిషన్ పొందని విద్యార్థులను గుర్తించి కళాశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్ విద్యా అధికారి ఆదేశించారు. విద్యార్థుల విద్యా సంవత్సరం వృథా కాకుండా ప్రతి అర్హత కలిగిన విద్యార్థికి ఇంటర్మీడియట్ విద్య అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

## శాంతి, సద్భావనను పెంపొందించే లక్ష్యంతోనే రాజీవ్ జ్యోతి సద్భావన

### డీసీసీ కార్పొరేషన్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :దేశంలో శాంతి, సద్భావనను పెంపొందించే లక్ష్యంతో రాజీవ్ జ్యోతి సద్భావన యాత్ర 35 ఏళ్ల క్రితం ప్రారంభమై, నేటికీ కొనసాగుతోందని డీసీసీ కార్పొరేషన్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ అన్నారు. శ్రీ పెరంబదూర్ నుంచి ఢిల్లీ వరకు కొనసాగుతున్న 35వ రాజీవ్ జ్యోతి సద్భావన యాత్ర శుక్రవారం నిజామాబాద్‌కు చేరుకుంది. యాత్ర అధ్యక్షుడు దొరాయ్ వేలు ఆధ్వర్యంలో కొనసాగుతున్న యాత్రకు డీసీసీ కార్పొరేషన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ డీసీసీ ఇన్‌చార్జ్ కౌడపు శరత్ కుమార్ తదితరులు భవన్ వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవం సందర్భంగా ప్రారంభమైన ఈ యాత్ర 'క్విట్ టెర్రరిజం' నినాదంతో ముందుకు సాగుతోందని తెలిపారు. ఆగస్టు 20న ఢిల్లీకి చేరుకోవడంతో యాత్ర ముగుస్తుందని ఆయన వెల్లడించారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలను స్మరించుకుంటూ, జాతీయ సమైక్యత, శాంతి, సద్భావన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే యాత్ర లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి భక్తవస్తలం, ఏఐసీసీ కో-ఆర్డినేటర్ గన్ రాజ్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాజేంద్ర ప్రసాద్, జెండా గుడి చైర్మన్ లవంగ ప్రమోద్, మాజీ కార్పొరేటర్ కుద్దుస్, బంటు బలరామ్, మహిళా కాంగ్రెస్ నాయకులు పోల ఉష, అపర్ణ, ఆకుల మహేందర్, జాఫర్, రాజ్ గగన్, సుమీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బందికి నైట్ డ్యూటీలు రద్దు చేయాలి

### యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.ఎల్ పద్మ





హైదరాబాద్, బతుకమ్మ :కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది, వర్కర్లకు నైట్ డ్యూటీలు రద్దు చేయాలని, వారానికి ఒకరోజు తప్పనిసరిగా వీక్లీ ఆఫ్ ఇవ్వాలని, జాబ్ చార్ట్ ను పక్కాగా అమలు చేయాలని టీయూసీఐ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.ఎల్ పద్మ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రజా భవన్‌తో పాటు స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, ఎఎస్ పిడి అధికారులకు శుక్రవారం వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు, రాష్ట్ర కార్యదర్శి ఎం. సుధాకర్ మాట్లాడుతూ.. కేజీబీవీ సిబ్బందికి క్యాజువల్ లీవ్స్ కు సంబంధించి ఆగస్టు 11 న జారీ చేసిన ఉత్తర్వుల్లో నాన్ టీచింగ్ సిబ్బంది, వర్కర్లకు వర్తించే విషయంలో స్పష్టత లేదన్నారు. నాన్ టీచింగ్ సిబ్బంది, వర్కర్లకు కూడా క్యాజువల్ లీవ్స్ వర్తించేలా స్పష్టతనిస్తూ సవరణ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. అకౌంటెంట్లు, వర్కర్లకు నైట్ డ్యూటీలు కేటాయించడం వల్ల తీవ్ర పనిభారం పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నైట్ డ్యూటీల రద్దుపై ఎస్‌పీడీ ఇచ్చిన హామీని అమలు చేసి, వెంటనే వాటిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, మెజారిటీ కేజీబీవీల్లో నాన్ టీచింగ్ సిబ్బంది, ముఖ్యంగా వర్కర్లకు వీక్లీ ఆఫ్‌లు సక్రమంగా అమలు కావడం లేదన్నారు. జాబ్ చార్ట్ కూడా సక్రమంగా అమలు కాకపోవడంతో నిర్ణయించిన పనిగంటలకు మించి పనిచేయిస్తున్నారని ఆరోపించారు. వీక్లీ ఆఫ్‌లు అమలు కాకపోవడం, జాబ్ చార్ట్‌కు మించి పని చేయించడం, నైట్ డ్యూటీలు కేటాయించడం వల్ల అకౌంటెంట్లు, వర్కర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్కర్లందరికీ వారానికి ఒకరోజు తప్పనిసరిగా సెలవు లభించేలా వీక్లీ ఆఫ్‌ను అమలు చేయాలని, జాబ్ చార్ట్‌ను పక్కాగా అమలు చేయాలని, నైట్ డ్యూటీలను పూర్తిగా రద్దు చేయాలని యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. నాన్ టీచింగ్ సిబ్బంది, వర్కర్లకు క్యాజువల్ లీవ్స్ వర్తించేలా ఇదే రోజు సవరణ ఉత్తర్వులు జారీ చేస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ జాతీయ ఉపాధ్యక్షులు వనమాల కృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు కే. సూర్యం, రాష్ట్ర నాయకులు నరేందర్, అరుణ్ కుమార్, రాజేశ్వర్, రాజన్న, దేవదానం తదితరులు పాల్గొన్నారు.

# లలితానగర్ వాసుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసి నగర కార్యదర్శి నీలం సాయి బాబా



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :నిజామాబాద్ నగరంలోని 8వ డివిజన్ పరిధిలో ఉన్న లలితానగర్ వాసుల విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లలితానగర్‌కు సమీపంలోని సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నగర కార్యదర్శి నీలం సాయి బాబా అన్నారు. ఈ విషయాన్ని కోరుతూ టీఎస్ఎన్‌పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ రాజేశ్వరరావుకు శుక్రవారం సీపీఐ పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నీలం సాయిబాబా, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం. శివకుమార్ మాట్లాడుతూ లలితానగర్‌లో సుమారు 50 నుంచి 100 కుటుంబాలు నివసిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం సిరిపూర్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరుగుతున్నందున తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. సిరిపూర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాలకు వ్యవసాయ అవసరాల కోసం అదే సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరుగుతుండటంతో లలితానగర్‌లో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. ముఖ్యంగా రాత్రివేళ కరెంటు పోతే తిరిగి ఉదయం వరకు సరఫరా కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కోతలతో పిల్లలు రాత్రిళ్లు సరిగా నిద్రపోలేకపోతున్నారని, ఫ్యాన్లు పనిచేయక దోమల బెడద పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని నాయకులు తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు సరిగా లేకపోవడంతో రాత్రివేళల్లో చీకటిలో ప్రమాదాలు చోటుచేసుకునే పరిస్థితి ఉందన్నారు. వైద్య ఖర్చుల రూపంలో పేద కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. లలితానగర్‌కు సమీపంలోని రోటరీనగర్, అయోధ్యనగర్, ఇంద్రాపూర్ తదితర ప్రాంతాలకు నిజామాబాద్ నగరం నుంచి విద్యుత్ సరఫరా జరుగుతోందని, అదే విధంగా లలితానగర్‌కు కూడా నగర సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేశారు. విద్యుత్ అంతరాయాలను నివారించి ప్రజలకు నిరంతర విద్యుత్ అందించాల్సిన బాధ్యత విద్యుత్ సంస్థ అధికారులపై ఉందన్నారు. లలితానగర్ ప్రజల విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ నగర నాయకులు గొంట్యాల రమేష్, ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా అధ్యక్షులు వనమాల సత్యం, నగర అధ్యక్షులు తాంపె రాజు, లలితానగర్ అభివృద్ధి కమిటీ సభ్యులు సుదర్శన్, వర్మ, జనార్ధన్, ఐఎఫ్‌టీయూ నాయకులు శంకర్, జె. రమేష్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు సమన్వయంతో కృషి చేయాలి

### శనివారం అట్టహాసంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

### క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా పాలనాధికారి





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :పేద కుటుంబాల ప్రయోజనాలతో ముడిపడి ఉన్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేసేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. నిజామాబాద్ నగరంలోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ లో ఈ నెల 15న (శనివారం) మధ్యాహ్నం రెండు గంటలకు లబ్దిదారులకు ముఖ్య అతిథిగా విచ్చేయనున్న ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ భవేష్ మిశ్రా శుక్రవారం జిల్లా అధికారులతో కలిసి భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ ను సందర్శించి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పరిశీలించారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, రేషన్ కార్డులు కలిగి ఉన్న లబ్దిదారులు, రేషన్ డీలర్లు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పార్కింగ్ వసతి ఉండాలని, వేదిక, సీటింగ్ అరేంజ్ మెంట్, సౌండ్ సిస్టం, ఎల్.ఈ.డీ స్క్రీన్లు తదితర ఏర్పాట్లను పక్కాగా సరిచూసుకోవాలని అన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, జిల్లా రెవెన్యూ అధికారి బి.గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ట్రైనీ ఆర్డీఓ సందీప్, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డీఆర్డీఓ సాయన్న, సివిల్ సప్లైస్ డీ.ఎం ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

# పంద్రాగస్టు వేడుకకు ముస్తాబైన పోలీస్ పరేడ్ గ్రౌండ్

## ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, పోలీస్ కమిషనర్

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, శనివారం ఉదయం 9.30 గంటలకు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ నేపథ్యంలో పరేడ్ గ్రౌండ్ లో పంద్రాగస్టు వేడుకకు చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్ భవేష్ మిశ్రా, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేదిక, బారికేడింగ్, సీటింగ్ అరేంజ్ మెంట్, పబ్లిక్ అడ్రస్ సిస్టం, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్లు తదితర వాటిని పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు, ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు, యువత విచ్చేయనున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. ఎగ్జిబిషన్ స్టాల్స్, శకటాల ప్రదర్శన ఆకట్టుకునే రీతిలో ఉండాలని అన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు కలెక్టరేట్ లో జరిగే పంద్రాగస్టు వేడుకలో పాల్గొని, పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించే వేడుకకు సైతం హాజరు కావాలని కలెక్టర్ సూచించారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో జిల్లా రెవెన్యూ అధికారి బి.గీత, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, ట్రైనీ ఆర్డీఓ సందీప్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, నిజామాబాద్ ఏసీపీ ప్రకాశ్ తదితరులు ఉన్నారు.



# జీ.జీ.హెచ్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

## అస్తవ్యస్థ పరిస్థితులు నెలకొని ఉండడం పట్ల అసంతృప్తి
## తక్షణమే పారిశుధ్య సమస్యను చక్కదిద్దాలని ఆదేశం





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :నిజామాబాద్ నగరంలోని ప్రభుత్వ జిల్లా జనరల్ ఆసుపత్రి (జీ.జీ.హెచ్)ను కలెక్టర్ భవేష్ మిశ్రా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి చుట్టూ తిరుగుతూ పరిసరాలు, ఆవరణను ప్రతి అంగుళం పరిశీలించారు. అడుగడుగున నెలకొని ఉన్న అస్తవ్యస్థ పరిస్థితులను చూసి కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎనిమిది అంతస్తుల భవన సముదాయంతో కూడిన ఈ ఆసుపత్రిలో నిర్వహణ లోపాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయని అన్నారు. అనేక చోట్ల డ్రైనేజీ పైప్ లైన్ల లీకేజీలు ఉండడం, ఆసుపత్రి ప్రాంగణంలో వ్యర్థ జలాలు నిలిచి ఉండడం, పరిసరాలు దుర్గంధం వెదజల్లుతూ ఉండడాన్ని గమనించిన కలెక్టర్ సంబంధిత అధికారుల పనితీరును ఆక్షేపించారు. ప్రత్యేకించి సానిటేషన్ విభాగం లోపాలను ఎత్తి చూపారు. పరిసితి ఇలా ఉంటే చికిత్స కోసం వచ్చే వారు, ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వారు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంటుందని అన్నారు. ఆస్పత్రి లోపలి భాగంతో పాటు, బయట ప్రాంగణంలోనూ ఏ ఒక్క చోట కూడా నీరు నిల్వ ఉండకూడదని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రిలోని ఆవరణలో ఉన్న ఓపెన్ డ్రైనేజీల మీద పైకప్పు నిర్మించాలని, మురుగు జలాలు నిలిచిపోకుండా వాటిని శుభ్రం చేయించాలన్నారు. పారిశుధ్య వ్యవస్థను చక్కదిద్దేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమగ్ర పరిశీలన జరపాలని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ కు సూచించారు. ఎక్కడ కూడా చెత్తాచెదారం పేరుకుపోకుండా రోజువారీగా వెంటదివెంట తొలగిస్తూ ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని జీ.జీ.హెచ్ అధికారులను ఆదేశించారు. ఎక్కడబడితే అక్కడ వృధా నిర్మాణ సామాగ్రి పేరుకుపోయి ఉండడంతో తక్షణమే తొలగింపజేయాలని సూచించారు. ఆసుపత్రి ప్రాంగణం రహదారి అంతా గుంతలమయంగా మారినందున, తక్షణమే మరమ్మతులు చేయించాలని అన్నారు. కుక్కలు, పశువులు ఆసుపత్రి ఆవరణలోకి రాకుండా కట్టడి చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్య పనుల విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా అనునిత్యం పకడ్బందీ పర్యవేక్షణ చేయాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాములు, ఇతర అధికారులు ఉన్నారు.

# తిరంగా ర్యాలీతో గుండె నిండా దేశభక్తి

## దేశం కోసం ప్రాణాలర్పించిన వారి చరిత్ర చదవండి....అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ
## ఇందూరులో రెపరెపలాడిన త్రివర్ణ పతాకం

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :తిరంగా ర్యాలీతో అందరి గుండె నిండా దేశభక్తి ఉప్పొంగిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ఆర్ ఆర్ చౌరస్తా నుంచి గాంధీ చౌక్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఒకప్పుడు కేవలం స్వాతంత్ర దినోత్సవం రిపబ్లిక్ డే రోజున మాత్రమే జాతీయ జెండాలను ఆవిష్కరించే వారన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు 2022లో ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. దీంతో ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమం వల్ల దేశభక్తి పెంపొందడమే కాకుండా స్వాతంత్ర సమరయోధుల చరిత్ర తెలిసే అవకాశం ఉంటుందన్నారు. ప్రధానంగా కులం మతం ప్రాంతం అనే భేదాలు లేకుండా భారతీయుల ఐక్యత కోసం రూపొందించిన కార్యక్రమం అన్నారు యువతలో జాతీయ భావాన్ని పెంపొందించడం దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యాన్ని పెంచడం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. తిరంగా ర్యాలీ అంటే చేతిలో జెండా పట్టుకొని నడవడం మాత్రమే కాదని ప్రతి ఒక్కరి హృదయంలో దేశభక్తిని మన ఆలోచనలలో జాతీయతను చేతల్లో దేశ నిర్మాణాన్ని నింపుకోవడం అన్నారు. ఇప్పటి యువత స్వాతంత్ర సమరయోధుల పాఠాలు చదవాలని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి తెలిపారు. చిన్న వయసులో ప్రాణాలర్పించిన భగత్ సింగ్, ఉద్ధం సింగ్, చంద్ర శేఖర్ ఆజాద్, అబ్దుల్ కలాం తదితరుల చరిత్రను తెలుసుకోవాలన్నారు. దేశానికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడిన ఊరుకునేది లేదన్నారు. మతాల మధ్య చిచ్చు పెడితే వదిలేది లేదన్నారు. మువ్వన్నెల జెండా ముద్దాడాలంటే అదృష్టం ఉండాలని, దేశం సురక్షితంగా ఉంటుందంటే కారణం వారి త్యాగ ఫలితమే అన్నారు. తిరంగా ర్యాలీ ఆద్యంతం హుషారుగా కొనసాగింది. ర్యాలీలో 150 మీటర్ల భారీ త్రివర్ణ పతాకం ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.






# వ్యాపారులకు కేటాయించిన స్థలాల్లోనే విక్రయాలు జరపాలి

## ఆగ్రో ఇండస్ట్రీ చైర్మన్ కాసుల బాలరాజ్



బాన్సువాడ, బతుకమ్మ :వ్యాపారులు అందరూ తమకు కేటాయించిన స్థలాల్లోనే విక్రయాలు జరపాలని ఆగ్రో ఇండస్ట్రీ చైర్మన్ కాసుల బాలరాజ్ కోరారు. బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి పాత బాన్సువాడకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులకు ప్రత్యేకంగా స్థలం కేటాయించే చర్యలు మున్సిపల్ అధికారులు శుక్రవారం చేపట్టారు. రోడ్డు పక్కన వ్యాపారాల కారణంగా ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా, వ్యాపారులకు కూడా సౌకర్యంగా ఉండేలా ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కూరగాయల వ్యాపారులతో కలిసి కాసుల బాలరాజ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఒకే చోట వ్యాపారాలు నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేస్తే రహదారిపై ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు ప్రజలకు, వ్యాపారులకు సౌకర్యంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఖలేఖ్, కోఆప్షన్ సభ్యులు ఖామర్ సుల్తానా గౌస్ పాషా, కాజీమ్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం



రుద్రూర్, బతుకమ్మ :రాష్ట్రీయ బాల్ స్వస్థ్య కార్యక్రమ్ (ఆర్బిఎస్కె) ఆధ్వర్యంలో శుక్రవారం రుద్రూర్ మండలం అంబం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ బీఎస్ కె డా. అరవింద్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత (హైజీన్), పౌష్టికాహారం తీసుకోవడం ప్రాముఖ్యత గురించి పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంబం గ్రామ సర్పంచ్ కూర్లేపు గంగాధర్, ఉపసర్పంచ్ రేపల్లె సాయి ప్రసాద్, అరవింద్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మనోజ్ ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఈఓ



రుద్రూర్, బతుకమ్మ :రుద్రూర్ మండలంలోని సులేమాన్ నగర్ గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి రాంసింగ్ ప్రజాప్రతినిధులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మార్గదర్శకాల ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందుతోందా లేదా అని పరిశీలించి విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ షాదుల్, మాజీ సర్పంచ్ షేక్ ఖాదర్, మాజీ కో అప్షన్ సభ్యులు దస్తగిర్, వార్డు సభ్యులు లింగం గౌడ్, అలీం ఖాన్, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.


## పేద కుటుంబానికి సర్పంచ్ ఆర్థిక సహాయం



ఏర్గట్ల, బతుకమ్మ :ఏర్గట్ల మండలం తోర్తి గ్రామానికి చెందిన పల్లపు రాజు గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్న రాజు పేద కుటుంబానికి చెందినవారు కావడంతో ఆయన మృతి కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంలోకి నెట్టింది. ఈ విషయం తెలుసుకున్న తోర్తి గ్రామ సర్పంచ్ కౌడ భూమేష్ మానవతా దృక్పథంతో స్పందించారు. అంత్యక్రియల ఖర్చుల కోసం తక్షణ సహాయంగా రూ.5 వేల ఆర్థిక సాయాన్ని మృతుడి కుమారుడికి అందజేశారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన సర్పంచ్ భూమేష్, ధైర్యంగా ఉండాలని సూచించారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పేద కుటుంబానికి ఆపద సమయంలో అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన సర్పంచ్ కౌడ భూమేష్‌ను గ్రామ ప్రజలు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

## జీవన భృతికి దరఖాస్తు అవకాశం కల్పించాలి

### టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ




హైదరాబాద్, బతుకమ్మ :రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన చేయూత పింఛన్లలో బీడీ కార్మికులకు జీవన భృతి కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ అన్నారు. ఈ విషయాన్ని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రజా భవన్, రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన చేయూత పింఛన్లలో బీడీ కార్మికులకు జీవన భృతి కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం లేకపోవడం అన్యాయమని అన్నారు. ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా నిరసిస్తున్నామని తెలిపారు. వెంటనే చేయూత పథకంలో బీడీ కార్మికులు జీవన భృతి కోసం దరఖాస్తు చేసుకునేలా ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నరేందర్, టీయూసీఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కే. సూర్యం, ఎస్.ఎల్. పద్మ, రాష్ట్ర నాయకులు డి. రాజేశ్వర్, ఎం. సుధాకర్, దేవదానం, వెంకన్న, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

## షెడ్డు నిర్మాణానికి భూమి పూజ



ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండలంలోని జీకే తాండలో సేవాలాల్ మహారాజ్ ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం నిర్మించనున్న రేకుల షెడ్డు నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ శిరీష మహిపాల్ నాయక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి సహకారంతో ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం షెడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు సర్పంచ్ శిరీష మహిపాల్ నాయక్ తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎండ, వర్షం నుంచి రక్షణ కల్పించడంతో పాటు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రజిత సుధర్, గ్రామ అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ దేవి, వార్డు సభ్యులు బలరాం, ఆకాష్, మోహన్, సునీత తదితరులు పాల్గొన్నారు.

# చందూర్ మండలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

### పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ, బతుకమ్మ :బాన్సువాడ నియోజకవర్గంలోని చందూర్ మండలంలో పలు అభివృద్ధి పనులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి శ్రీకారం చుట్టారు. మేడిపల్లి తండా, లక్ష్మీ సాగర్ తండా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు.మేడిపల్లి గ్రామంలో రూ.25 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మేడిపల్లి నుంచి లక్ష్మీ సాగర్ వరకు ఎస్డీఎఫ్ నిధులతో రూ.కోటి వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు.అలాగే లక్ష్మీ సాగర్ నుంచి వ్యవసాయ పంట పొలాలకు వెళ్లేందుకు ఎస్డీఎఫ్ నిధులతో రూ.70 లక్షల వ్యయంతో నిర్మించిన మెటల్ రోడ్డు, లో లెవెల్ వంతెనను కూడా పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే



మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన పనులను



చేపడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో చందూర్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బాన్సువాడలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

### జాతీయ జెండాలతో పట్టణ ప్రధాన వీధుల్లో బీజేపీ శ్రేణుల ర్యాలీ

బాన్సువాడ, బతుకమ్మ :ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బాన్సువాడ పట్టణంలో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి బీజేపీ పట్టణ అధ్యక్షుడు కోణాల గంగారెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ ప్రారంభమై ప్రధాన వీధుల గుండా సాగింది. బీజేపీ నాయకులు, కార్యకర్తలు చేతుల్లో జాతీయ జెండాలను పట్టుకొని ర్యాలీలో పాల్గొన్నారు. 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' నినాదాలతో పట్టణంలో దేశభక్తి వాతావరణం నెలకొంది. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయడంతో పాటు దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, మాజీ ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భారతదేశ చరిత్ర, సంస్కృతి, గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పడంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం కీలకమని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశ ఐక్యత, సమగ్రతను చాటాలని



పిలుపునిచ్చారు. 'నా దేశం.. నా జెండా.. నా గౌరవం' అనే భావన ప్రతి భారతీయుడిలో నిండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చీదురు సాయిలు, జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి చిరంజీవి, బీజేపీ కౌన్సిలర్ గజ్జల మహేష్, జిల్లా కో-ఆప్షన్ సభ్యుడు ప్రసాద్ కిషన్, జిల్లా ప్రధాన కార్యదర్శి



మోహన్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నస్రుల్లాబాద్ మండల అధ్యక్షుడు హనుమాన్లు, ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ పంతులు, నాయకులు లక్ష్మీనారాయణ, చీకట్ల రాజు, శ్యామల శ్రీకాంత్, పాశం భాస్కర్ రెడ్డి, శివశంకర్, కొండని గంగారం, సాయిబాబా, యోగి పురుషోత్తం, సచిన్, ప్రదీప్, మహేందర్, పద్మ, నరేష్, సాయిరెడ్డి, భూమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో అసిస్టెంట్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ట్రైనీ ఐఏఎస్, అసిస్టెంట్ కలెక్టర్ సురేష్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను స్వయంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అనే విషయాన్ని ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రామ్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి, వాటికి నీరు పోశారు. అదే పాఠశాలలో యంగ్ స్టార్ యూత్ సభ్యులు తమ సొంత నిధులతో ఏర్పాటు చేసిన నీటి ట్యాంకును అసిస్టెంట్ కలెక్టర్ సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టిన యంగ్ స్టార్ యూత్ సభ్యులను ఆయన అభినందించారు. గురుజాడ అప్పారావు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడుస్తూ సమాజ సేవకు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగామణి గంగారం, ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, తహసీల్దార్ బాలయ్య, ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రామ్ రెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు




కామారెడ్డి, బతుకమ్మ :కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం మర్కల్ గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతదేశ గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ శియాలి రామామృత రంగనాథన్ సేవలను కళాశాల సిబ్బంది, విద్యార్థులు స్మరించుకున్నారు. 1892 ఆగస్టు 12న జన్మించిన డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ భారతదేశంలో గ్రంథాలయ, సమాచార శాస్త్ర అభివృద్ధికి విశేష కృషి చేశారు. ఆయన సేవలకు గుర్తింపుగా ఆయనను "ఫాదర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ ఇన్ ఇండియా"గా గౌరవిస్తారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. శోభారాణి మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో గ్రంథాలయానికి ఉన్న ప్రాధాన్యతను వివరించారు. పుస్తక పఠనం వల్ల జ్ఞానం, ఆలోచనా శక్తి, సృజనాత్మకత, వ్యక్తిత్వ వికాసం పెరుగుతాయని తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు, ఉన్నత విద్యను అభ్యసించేవారికి గ్రంథాలయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. "పుస్తకం మనిషికి మంచి మిత్రుడు" అని, విద్యార్థులు నిరంతరం పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎస్. కృష్ణవేణి, లైబ్రేరియన్ కవిత, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల నుంచి సర్ధాపూర్ గోదాంలోకి ఈవీఎంల తరలింపు

## ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్

సిరిసిల్లా, బతుకమ్మ :2018 వేములవాడ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన కోర్టు కేసు కారణంగా ఇంతకాలం సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేకంగా భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంల)ను గురువారం సర్ధాపూర్‌లోని ఈవీఎం గోదాంలోకి తరలించారు. కోర్టు కేసు ముగిసిన నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి అనుమతులు వచ్చిన అనంతరం, ఎన్నికల నిబంధనలు, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఈవీఎంల తరలింపు ప్రక్రియను చేపట్టారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఈ ప్రక్రియను పరిశీలించి, ఈవీఎంలు భద్రపరిచే విధానంపై అధికారులకు పలు సూచనలు చేశారు. 2018 వేములవాడ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన కోర్టు కేసు కారణంగా



ఇంతకాలం సంబంధిత ఈవీఎంలను ప్రత్యేకంగా సిరిసిల్ల లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భద్రపరిచామని, రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతుల మేరకు ప్రస్తుతం వాటిని సర్ధాపూర్‌లోని గోదాంలో భద్రపరిచేందుకు తరలించినట్లు కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో, పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య



ఈవీఎంల తరలింపు ప్రక్రియను పూర్తి చేశామని కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, వేములవాడ ఆర్డీఓ కె.ఎస్.బి. కుమారి, తహశీల్దార్లు మహేష్ కుమార్, జయంత్, ఎన్నికల విభాగం నాయబ్ తహసీల్దార్ రెహమాన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలి

## వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత

జనగామ, బతుకమ్మ :భరోసా కేంద్రానికి వచ్చే ప్రతి బాధితుడిని సానుభూతితో, గౌరవప్రదంగా స్వాగతించి, వారి సమస్యలను పూర్తిగా తెలుసుకుని, సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత ఆదేశించారు. శుక్రవారం జనగామలోని భరోసా కేంద్రాన్ని సీపీ ఆకస్మికంగా సందర్శించి, కేంద్రంలో అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా భరోసా కేంద్రంలో బాధితులకు అందిస్తున్న కౌన్సెలింగ్, న్యాయ సహాయం, వైద్య సేవలు, మానసిక పరామర్శ, పునరావాస చర్యలు తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. మహిళలు, చిన్నారులు, ఇతర బాధితులకు ఒకే వేదికపై అన్ని సేవలు అందించే భరోసా కేంద్రం ప్రజలకు మరింత చేరువ కావాలని, ప్రతి కేసును నాణ్యతతో, వేగవంతంగా పరిష్కరించేలా



సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. బాధితుల గోప్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, వారికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్శనలో వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర



నాయక్, భరోసా కేంద్రం ఇన్‌స్పెక్టర్ సువర్ణ, ఏసీపీలు భీం శర్మ, నర్సయ్య, ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భరోసా కేంద్రం కోఆర్డినేటర్ సుధా, లీగల్ అడ్వైజర్ దయామణి, సపోర్ట్ పర్సన్స్ స్వాతి, అపర్ణతో పాటు ఇతర సిబ్బంది సునీత, హరిత పాల్గొన్నారు.

# మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

## ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్

ఎల్లారెడ్డి, బతుకమ్మ :ఎల్లారెడ్డినియోజకవర్గంలోని నిరుద్యోగ యువత మెగా జాబ్ మేళా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ పిలుపునిచ్చారు. మదన్ మోహన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 24న నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పోస్టర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా ఈ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని తెలిపారు. జాబ్ మేళాలో 70కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొననున్నాయని, 5,000కు పైగా ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. గత 10 సంవత్సరాలుగా తన సొంత ఖర్చులతో జాబ్ మేళాలను నిర్వహిస్తూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో తొలిసారిగా కామారెడ్డిలో టాటా జాబ్ మేళాను నిర్వహించినప్పుడు యువత నుంచి విశేష స్పందన లభించిందని గుర్తుచేశారు. “ఒక ఇంట్లో ఒకరికి ఉద్యోగం వస్తే.. ఆ కుటుంబం మూడు పూటలా కడుపునిండా భోజనం చేస్తుంది” అనే నినాదంతో నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తున్నామని మదన్ మోహన్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి నిరుద్యోగ యువతీ యువకుడు ఈ మెగా జాబ్ మేళాలో పాల్గొని తమ భవిష్యత్తుకు మంచి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్స్ , సర్పంచ్




లు కాంగ్రెస్ పార్టీకి చెందిన 8 మండలాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇప్పకాయల హరిదాసు స్వామీజీకి ఘన సన్మానం

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ఆధ్యాత్మిక చింతనతో పాటు సమాజ సేవలో విశేష సేవలందిస్తున్న ఇప్పకాయల హరిదాసు స్వామీజీకి ఘన సన్మానం లభించింది. ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో శుక్రవారం భాగ్యనగరంలోని శ్రీ సార్వత్రిక కళామందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను సమాజ సేవకుడిగా అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా అవార్డు స్వీకరించిన ఇప్పకాయల హరిదాసు స్వామీజీ మాట్లాడుతూ, తనకు లభించిన ఈ సన్మానం వ్యక్తిగతంగా తనకు దక్కిన గౌరవంగా భావించడం లేదని అన్నారు. ఇది ఒక సామాజిక సన్మానమని, ఆధ్యాత్మిక చింతనాపరుడిగా, సమాజ సేవకుడిగా తనను తీర్చిదిద్దిన అనేకమంది ప్రజలకు ఈ గౌరవం చెందుతుందని పేర్కొన్నారు. తన సేవా ప్రస్థానానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనను ఆధ్యాత్మిక చింతన వైపు నడిపించి, సమాజ సేవలో ముందుకు తీసుకెళ్లిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. తన సేవలను గుర్తించి అవార్డుతో సత్కరించిన ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రతినిధులకు ఇప్పకాయల హరిదాసు స్వామీజీ కృతజ్ఞతలు తెలిపారు. సమాజ సేవలో మరింతగా ముందుకు సాగుతూ ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ




కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు, సామాజిక సేవకులు, ఆధ్యాత్మికవేత్తలు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# 'టెస్సరాక్ట్' భూ కుంభకోణంపై లోకాయుక్తను ఆశ్రయించిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు



హైదరాబాద్, బతుకమ్మ :రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యుల ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ‘మెసర్స్ టెస్సరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్’కు ప్రభుత్వ భూమిని నిబంధనలకు విరుద్ధంగా కట్టబెట్టారంటూ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు తెలంగాణ లోకా యుక్తను ఆశ్రయించారు. రంగారెడ్డి జిల్లాలో సుమారు 5 ఎకరాల విలువైన ప్రజా భూమిని సంస్థకు కేటాయించడంలో అవకతవకలు జరిగాయని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఈ భూమి ప్రస్తుత మార్కెట్ విలువ సుమారు రూ.135 కోట్ల నుంచి రూ.200 కోట్ల వరకు ఉంటుందని వారు పేర్కొన్నారు. ప్రజా భూముల ధారాదత్తం, బినామీ లావా దేవీలు, బంధుప్రీతి, అధికార దుర్వినియోగం వంటి అంశాలకు సంబంధించి మొత్తం 13 కీలక ఆధారాలను లోకాయుక్తకు సమర్పించినట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ సంస్థకు అప్పగించే ప్రక్రియలో నిబంధనలు ఉల్లంఘించారన్న అంశంపై సమగ్ర విచారణ జరిపించాలని వారు కోరారు. ఈ ఫిర్యాదును ఎమ్మెల్సీలు డా. దాసోజు శ్రవణ్ కుమార్, మంకెన కోటిరెడ్డి, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, డా. సంజయ్ కల్వకుంట్లతో పాటు బీఆర్ఎస్ నాయకుడు డా. మన్నె క్రిశాంక్ కలిసి తెలంగాణ లోకాయుక్తకు సమర్పించారు. టెస్సరాక్ట్ సంస్థకు భూమి కేటాయింపు వెనుక ఉన్న నిర్ణయాలు, సంబంధిత అధికారుల పాత్ర, లావాదేవీల స్వభావం, ప్రజా ప్రయోజనాలకు జరిగిన నష్టంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు.

# సిరిసిల్లలో తొలి సాదాబైనామా కేసు ఆమోదం



సిరిసిల్ల, బతుకమ్మ :సాదాబైనామా ద్వారా జరిగిన భూ లావాదేవీల క్రమబద్ధీకరణ ప్రక్రియలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో తొలి సాదాబైనామా కేసు ఆమోదం పొందింది. తంగళ్లపల్లి మండలంలోని తంగళ్లపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో ఈ కేసుకు ఆమోదం లభించడం చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందని సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన సాదాబైనామా కేసులను పారదర్శకంగా పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులకు భూ హక్కుల క్రమబద్ధీకరణ జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీఓ తెలిపారు. జిల్లాలో తొలి కేసు ఆమోదం పొందడం సంతోషకరమైన పరిణామమని, అర్హత కలిగిన మిగతా సాదాబైనామా కేసులను కూడా ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనల మేరకు ఎలాంటి జాప్యం లేకుండా దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు ఇటికాల శంకర్‌కు తంగళ్లపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 5లో ఉన్న 0.30 గుంటల భూమికి సంబంధించిన 13(బి) ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, తంగళ్లపల్లి తహసీల్దార్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# భిక్కనూరు ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన సవిత



భిక్కనూర్, బతుకమ్మ :భిక్కనూరు మండల ఎంపీడీవోగా సవిత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పాటిస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుంటానని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న 30 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

### గుజరాత్ రాష్ట్రానికి తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు

### ముగ్గురిపై కేసు నమోదు




పిట్లం, బతుకమ్మ :కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలో పేదలకు చెందాల్సిన ప్రజా పంపిణీ వ్యవస్థ (రేషన్) బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పిట్లం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. హైదరాబాద్ నగర పరిసర ప్రాంతాల నుంచి గుజరాత్ రాష్ట్రానికి జాతీయ రహదారి మీదుగా సరుకు రవాణా వాహనంలో బియ్యం అక్రమ రవాణా జరుగుతోందని పోలీసులకు ముందస్తుగా నమ్మదగిన సమాచారం అందింది. ఈ సమాచారం ఆధారంగా పిట్లం ఎస్ఐ ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది వెంకటేష్, రాజేశ్వర్‌లతో కలసి పిట్లం కూడలి సమీపంలోని పైవంతెన (ఫ్లైఓవర్) వద్ద తీవ్రస్థాయిలో వాహనాల తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్ వైపు నుంచి నాందేడ్ వైపు వెళ్తున్న ఒక పెద్ద సరుకు రవాణా వాహనాన్ని అనుమానాస్పదంగా గుర్తించి ఆపి తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా వాహనంలో 632 ప్లాస్టిక్ సంచుల్లో భద్రపరిచిన సుమారు 30 టన్నుల రేషన్ బియ్యాన్ని గుర్తించి, బియ్యంతో పాటు వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ రవాణా ఘటనపై సమగ్ర విచారణ జరిపిన పోలీసులు, వాహన చోదకులు గుజరాత్ రాష్ట్రం సూరత్ జిల్లా బర్డోలికి చెందిన పర్బత్ కరంటా దేవరాజ్ (52), మహారాష్ట్రలోని ధూలే జిల్లాకు చెందిన శరద్ ఆబా బచ్‌కర్లతో పాటు, ఈ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న హైదరాబాద్ నివాసి ఇబ్రహీంపై చట్టరీత్యా కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రజా పంపిణీ బియ్యం అక్రమ రవాణాను సమర్థవంతంగా అడ్డుకున్న పిట్లం ఎస్ఐ, పోలీస్ సిబ్బంది పనితీరును కామారెడ్డి జిల్లా పోలీస్ ఎస్పీ రాజేష్ చంద్ర ప్రత్యేకంగా ప్రశంసించి, అభినందనలు తెలిపారు. పేద ప్రజల కడుపు నింపడానికి ప్రభుత్వం సరఫరా చేసే రేషన్ బియ్యాన్ని అక్రమంగా విక్రయించినా, నిల్వ చేసినా లేదా సరిహద్దులు దాటించేందుకు ప్రయత్నించినా చట్టప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

# అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర

రుద్రూర్, బతుకమ్మ :అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర 13 వ రోజుకు చేరుకుంది. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణం నుండి ప్రారంభించారు. ఈ రథయాత్ర శుక్రవారం రుద్రూర్ గ్రామానికి చేరుకుంది. గౌడ సంఘం కుల సభ్యులందరూ స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు, గౌడ సోదరులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కల్లుగీత కార్మికులందరూ వన మహోత్సవంలో భాగంగా ఈత, తాటి చెట్ల పెంపకం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు గుండూరు విఠల్ గౌడ్, బాల్ రాజ్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, గుండూరు ప్రశాంత్ గౌడ్, రాజా గౌడ్, సుదర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# 24 గంటల్లోనే చైన్ స్నాచర్‌ను అరెస్ట్ చేసిన నందిపేట్ పోలీసులు

నందిపేట్, బతుకమ్మ :నందిపేట్ మండల పరిధిలోని బజార్ కొత్తూరు గ్రామ శివారులో మహిళ మెడలో నుంచి బంగారు చైన్ అపహరించిన నిందితుడిని నందిపేట్ పోలీసులు 24 గంటలు గడవకముందే అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. మాక్లూర్ మండలానికి చెందిన పిట్ట భోజవ్వ తన అక్క రత్న అనారోగ్యంతో ఉండటంతో ఆమెను పరామర్శించేందుకు ఉమ్మెడ గ్రామానికి వచ్చింది. అనంతరం తిరుగు ప్రయాణంలో మాయాపూర్ అంబేద్కర్ బస్‌స్టాప్ వద్ద బస్సు కోసం ఎదురుచూస్తుండగా, అటుగా మోటార్‌సైకిల్‌పై వచ్చిన ఓ వ్యక్తి తాను నందిపేట్‌లో దింపుతానని చెప్పి ఆమెను బైక్‌పై ఎక్కించుకున్నాడు. అతను కొత్తూరు గ్రామ శివారుకు తీసుకెళ్లి బైక్‌ను ఆపి, మహిళ మెడలో ఉన్న బంగారు చైన్‌ను లాక్కొని అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నందిపేట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్సై వినయ్ ఆధ్వర్యంలో పోలీసులు మాయాపూర్ గ్రామంలోని సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించి నిందితుడిని గుర్తించారు. నిందితుడు దిలీప్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. దిలీప్‌పై గతంలోనూ ఓ అత్యాచారం కేసులో ఏ-1 నిందితుడిగా ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైనట్లు తెలిపారు.

# కామారెడ్డిలో ఘనంగా 35వ రాజీవ్ జ్యోతి సద్భావనా యాత్రకు స్వాగతం

కామారెడ్డి, బతుకమ్మ :జాతీయ సమైక్యత, మత సామరస్యం, దేశ సమగ్రత సందేశంతో కొనసాగుతున్న 35వ రాజీవ్ జ్యోతి సద్భావనా యాత్రకు కామారెడ్డి పట్టణంలో ఘన స్వాగతం లభించింది. కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు యాత్రలో పాల్గొన్న వారికి స్వాగతం పలికారు. మాజీ ప్రధానీ, దివంగత రాజీవ్ గాంధీ దేశ నిర్మాణానికి చేసిన సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, జాతీయ ఐక్యత, మత సామరస్యం, దేశ సమగ్రతను బలోపేతం చేయడం యాత్ర ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు. ఆగస్టు 9న తమిళనాడులోని శ్రీపెరంబుదూర్ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, హర్యానా రాష్ట్రాల మీదుగా సాగి ఆగస్టు 20న న్యూఢిల్లీలో ముగియనుంది. కామారెడ్డిలో నిర్వహించిన



కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, కామారెడ్డి టౌన్ కాంగ్రెస్



అధ్యక్షులు ఐరేని సందీప్ కుమార్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సూర్యాపేట డబుల్ మర్డర్ కేసును చేదించిన పోలీస్‌లు

### 3 లక్షల అప్పు.. నమ్మించి నట్టేట ముంచిన కానిస్టేబుల్

### ఖాకీ చొక్కా వేసుకుని రక్షించాల్సినోడే భక్షించిండు



సూర్యాపేట, బతుకమ్మ :సూర్యాపేట జిల్లా మోతే మండలంలో సంచలనం సృష్టించిన భార్యాభర్తల జంట హత్య కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా మోతే పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్‌నే పోలీసులు గుర్తించడం కలకలం రేపుతోంది. పోలీసుల వివరాల ప్రకారం.. మోతేలో పంచాయతీ వ్యవహారాలకు వస్తుండే జిల్లేపల్లి సుందర్ ద్వారా కానిస్టేబుల్ యండి. షరీఫ్‌కు మృతులు నాగులు, భూబా దంపతులతో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయంతో వారితో నమ్మకాన్ని పెంచుకున్న షరీఫ్.. వారి వద్ద నుంచి రూ.3 లక్షలు అప్పుగా తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే తీసుకున్న డబ్బును తిరిగి ఇవ్వాలని నాగులు, భూబా అడగడంతో వివాదం మొదలైనట్లు పోలీసులు తెలిపారు. డబ్బులు తిరిగి ఇవ్వాల్సి వస్తుందనే భయంతో వారిని హత్య చేసి అడ్డుతొలగించుకోవాలని షరీఫ్.. సుందర్‌తో కలిసి పథకం రచించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. పథకం ప్రకారం నాగులు, భూబాలను హత్య చేసిన అనంతరం మృతదేహాలను జాతీయ రహదారి పక్కన పూడ్చిపెట్టినట్లు పోలీసులు గుర్తించారు. దర్యాప్తులో భాగంగా సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా.. సుందర్ భూబాను తీసుకెళ్తున్న దృశ్యాలు పోలీసులకు కీలక ఆధారంగా మారాయి. దీంతో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేసి గురువారం ఉదయం సూర్యాపేట కొత్త బస్టాండ్ వద్ద షరీఫ్, సుందర్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుపై సూర్యాపేట ఎస్పీ నరసింహ మాట్లాడుతూ.. నేరానికి పాల్పడితే పోలీసు అయినా సరే చట్ట ప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు. చట్టం ముందు అందరూ సమానమేనని తెలిపారు. కేసు దర్యాప్తులో కోదాడ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ లచ్చిరెడ్డి, సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ కీలక పాత్ర పోషించారు.

# వాహనదారులు పోలీసులకు సహకరించాలి

### బోర్గాం బ్రిడ్జి వద్ద పోలీసుల నాకాబందీ....నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :వాహనదారులు పోలీసులకు సహకరించాలని, రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సూచించారు. నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు రహదారి భద్రతను పటిష్టం చేసే లక్ష్యంతో నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శుక్రవారం సాయంత్రం విస్తృతంగా నాకాబందీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఏకకాలంలో వాహన తనిఖీలు చేపట్టారు. నిజామాబాద్ నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బోర్గాం బ్రిడ్జి వద్ద సీపీ ఆధ్వర్యంలో నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ స్వయంగా తనిఖీలను పర్యవేక్షిస్తూ బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగిస్తున్న కార్లు, ద్విచక్ర వాహనాలను ఆపి క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. వాహనదారుల డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్సీ), ఇన్సూరెన్స్, నంబర్ ప్లేట్లు తదితర పత్రాలను పోలీసులు



పరిశీలించారు. నంబర్ ప్లేట్లు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా, వాహనానికి సంబంధించిన పత్రాలు సక్రమంగా ఉన్నాయా అనే అంశాలను తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా కనిపించిన వాహనాలను ప్రత్యేకంగా తనిఖీ చేసి, వాహనదారుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను కలిగి ఉండాలని సూచించారు. నంబర్



ప్లేట్లను నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేసుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, నేరాల నియంత్రణ, అక్రమ రవాణా నివారణతో పాటు అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా పెంచేందుకు కమిషనరేట్ పరిధిలో ఆకస్మిక నాకాబందీలు, వాహన తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోర్త్ టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎస్. సతీష్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, సీసీఎస్ సీఐ అజయ్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ ఆలయంలో దొంగతనం చేసిన ఇద్దరి అరెస్ట్

### 36 గ్రాముల బంగారు ముక్కుపోగులు,

### బైక్ స్వాధీనం చేసుకున్న పోలీసులు

సదాశివనగర్, బతుకమ్మ :కామారెడ్డి జిల్లా సదశివ నగర్ మండలం ధర్మారావుపేట్ గ్రామంలోని ఎల్లమ్మ ఆలయంలో జరిగిన బంగారు ముక్కుపోగుల చోరీ కేసును సదాశివనగర్ పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. సీఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం...ఈ నెల 8న సదాశివనగర్‌కు చెందిన తోగరి శ్రీనివాస్ (47), ధర్మారావుపేట్‌కు చెందిన తోగరి మల్లేశ్వరి (41) ఆలయానికి తాళం వేసి ఉండటాన్ని గమనించారు. గుడి గేటు తాళాన్ని రాయితో పగులగొట్టి లోపలికి చొరబడి, అమ్మవారి విగ్రహాలకున్న 36 గ్రాముల బంగారు ముక్కుపోగులను దొంగిలించారు. అయితే చోరీ చేసిన బంగారం కామారెడ్డిలో అమ్మడానికి శుక్రవారం బైక్‌పై బయలుదేరారు. మర్కల్ ఎక్స్ రోడ్డు (చీఎ-44) వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండటం చూసి, భయంతో వెనక్కి తిరిగి పారిపోయేందుకు యత్నించారు. గమనించిన పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. విచారణలో నిందితులు నేరాన్ని ఒప్పుకోవడంతో వారి వద్ద నుంచి 36 గ్రాముల బంగారు ముక్కుపోగులు, చోరీకి ఉపయోగించిన మోటార్ సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దరినీ అరెస్ట్ చేశారు. కేసును త్వరగా ఛేదించిన ఎస్సై ఎం. పుష్పరాజ్, క్రైమ్ పార్టీ సిబ్బందిని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర ప్రత్యేకంగా అభినందించారు

